క్లుప్తంగా

గీతాంజలిలో ఘనంగా ఫేర్‌వెల్ పార్టీ



మాట్లాడుతున్న పెరుగు విజయవర్ధన్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లోని గీతాంజలి నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ కోర్సును ముగించుకున్న 2018–22 బ్యాచ్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు ఘనంగా ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల అధినేత పెరుగు విజయవర్ధన్‌రెడ్డి, ప్రత్యేక అతిథిగా టీటీడీ ధర్మప్రచార పరిషత్ కమిటీ సభ్యులు డాక్టర్ వై.సూర్యచంద్రారెడ్డి హాజరై ప్రసంగించారు. నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారు సమాజంలో బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వసంతకుమారి, కిమ్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అర్చన, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో కామద ఏకాదశి వేడుకలు



స్వామివారికి హారతి ఇస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: స్థానిక ఇస్కాన్ జగన్నాథ మందిరంలో ఆదివారం కామద ఏకాదశి వేడుకలు నిర్వహించారు. హరే కృష్ణ హరే రామ నామ జపం సామూహికంగా పఠించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. సంధ్యా హారతి, తులసి హారతి, రాజభోగ నివేదన చేశారు. అనంతరం ఇస్కాన్ బాధ్యులు రామ కృష్ణ ప్రభు ప్రవచనం చెప్పారు.

పది విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు

కర్నూలు(రాజ్‌విహార్): పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల కోసం రెండు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు కర్నూలు–2డిపో మేనేజరు బి.సర్దార్ హుసేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ విన్నపం మేరకు ఈ నెల 3వ తేదీ నుంచి కర్నూలు నుంచి సుంకేసుల మీదుగా కొత్తకోటకు ఉదయం 8 గంటలకు బస్సు బయలుదేరి తిరిగి పరీక్షల అనంతరం కర్నూలుకు వస్తుందని, సి.బెళగల్, గుండ్రేవుల, కొత్తకోట రూటులో మరో విద్యార్థి బస్సు నడపనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బస్సుల్లో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే సెల్ 73828 71131, 99592 25794 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

సేవాగుణం కలిగి ఉండాలి

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరు సేవాగుణం కలిగి ఉండాలని డాక్టర్ మధుసూదన వర్మ అన్నారు. చిదంబరావు వీధిలోని స్వామి వివేకానంద సంస్కృత పాఠశాలలో ఆదివారం అన్నపూర్ణమ్మ విద్యార్థి వసతి గృహం 29వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా భారతి ద్వారా జరుగుతున్న విద్య వైద్య సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. వసతి గృహం అధ్యక్షులు చిరంజీవిరెడ్డి, సేవా భారతి అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 1994లో ప్రారంభించిన వసతి గృహం దాతల సహకారంతో ముందుకు సాగుతుందన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు చాలా మంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. ప్రధాన వక్త ఓలేటి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో వసతి గృహం కార్యదర్శి బాలాజీ రావు, కోశాధికారి బచ్చు సుబ్రహ్మణ్యం, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సభ్యులకు శిక్షణ

కర్నూలు(హాస్పిటల్): రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3160లో 3,5,6,7 క్షేత్రాలకు(జోన్స్) 2023–24 సంవత్సరానికి గాను కొత్తగా ఎన్నికైన వారికి ఆదివారం కల్లూరులోని వాసవి కళ్యాణసదన్‌లో ఫంక్షన్ హాలులో శిక్షణ ఇచ్చారు. ఇందులో దాదాపు 19 క్లబ్స్‌లో ఎన్నికైన పీఈటీలు, ఎస్ఈటీఎస్‌లు, టీఈటీఎస్‌లకు గ్రేటర్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షులు వాసురెడ్డి, ఆర్గనైజింగ్ చైర్మన్ విజయకుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ మాణిక్‌ప్రభు, పీడీజీ శ్రీరామమూర్తి, విజయనాగరాజు, కాబోయే ఏజీ భరత్‌షా పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : దసరా, భోలా, దాస్ కా ధమ్కీ,బలగం
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: దసరా, సత్యం వధ ధర్మం చరా, పరారి దాస్ కా ధమ్కీ, డంజియన్స్ అండ్ డ్రాగన్స్ హానర్ అమాంగ్ థీవ్స్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: సార్,దాస్ కా ధమ్కీ
ఐనాక్స్: భోలా, డంజియన్స్ అండ్ డ్రాగన్స్ హానర్ అమాంగ్ థీవ్స్, జాన్ విక్ చాప్టర్–4
భరత్ : జాన్ విక్ చాప్టర్–4,సార్
రాజ్: దసరా
శ్రీరామ: దసరా
విజయ : దసరా

ఒత్తిడిని జయిస్తేనే విజయం!

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా తల్లిదండ్రులు చూసుకోవాలి
- ఆహారం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరైతే ఉత్తమ ఫలితాలు



చిప్పగిరిలో ఏర్పాటు చేసిన పది పరీక్ష కేంద్రం

కర్నూలు సిటీ: పది పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే పరీక్షలు అంటే సహజంగా ఒత్తిడి ఉంటుంది. అయితే ఈ ఒత్తిడిని జయిస్తే పరీక్షల్లో విద్యార్థులు సులువుగా విజయం సాధిస్తారు. విద్యార్థులు పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి. ఒకవేళ భయానికి గురైతే పరీక్ష రాసేటప్పుడు చదివినదంతా మరిచిపోయే ప్రమాదం ఉంది. ఈ భయం కారణంగా గందరగోళంతో కూడిన జవాబులు రాసే అవకాశాలే అధికం. కాబట్టి భయానికి చెక్ పెట్టాలంటే ముందు తల్లిదండ్రులు విద్యార్థులకు కావాల్సిన ధైర్యాన్ని నూరిపోయాలి. వారి మీద ఎక్కువ ఒత్తిడి పెట్టకూడదు. విద్యార్థులు ఒత్తిడికి గురైతే దాని ప్రభావం వారి ఆరోగ్యంపైనా కనిపిస్తుంది. దీంతో వారు పరీక్షలు సరిగా రాయలేరు. కాబట్టి పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులను ఒత్తిడికి దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీదే ఉంది. పిల్లల పట్ల సున్నితంగా మెలుగుతూ, ఆహారం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యా రంగ నిపుణులు చెబుతున్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరైతే ఉత్తమ ఫలితాలు సాధిస్తారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి!

ఈ నెల 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షలకు జిల్లాలోని ఉన్నత పాఠశాలలకు చెందిన 32,760 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఏడాదిపాటు నేర్చుకున్న పాఠాలను, వాటి ద్వారా పొందిన పరిజ్ఞానాన్ని ప్రదర్శించి మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులకు పరీక్షలు ఒక అవకాశం. కొందరు ప్రణాళికబద్ధంగా పరీక్షలకు సిద్ధపడితే, చాలా మంది సిలబస్ మొత్తం చదివినా పరీక్షల్లో సరిగా రాయగలమా లేదోనసే ఆందోళనతో సతమతమవుతుంటారు. ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులను తల్లిదండ్రులు గుర్తించి, వారికి పలు సూచనలు, సలహాలు ఇవ్వాలి. పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి.

- పరీక్షలకు సన్నద్ధం అయ్యే సమయంలో విద్యార్థులు పదే పదే బయటికి పోకుండా చూసుకోవాలి. టీవీలు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి
- చదువుతున్న పిల్లలను అబ్జర్వ్ చేస్తూ, వేళకు వారితో పాటే కూర్చొని భోజనం చేయాలి. అతిగా ఆహారం తీసుకోకుండా చూసుకోవాలి. తేలికగా జీర్ణమయ్యే సమతుల ఆహారం ఇవ్వాలి.
- చదువుకునే పరిసర ప్రాంతాల్లో ఎలాంటి శబ్దాలు, ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలి.
- రీడింగ్ రూంలో స్వచ్ఛమైన నీటిని అందుబాటులో ఉంచాలి. ఆ గదిలో సరైన వెలుతురు, గాలి దారాళంగా వచ్చేలా ఉంటే విద్యార్థులు ఉత్సాహంగా ఉంటారు.
- కాఫీ, టీ, కూల్‌డ్రింక్స్ వంటి పానీయాలకు దూరంగా ఉంచడమే మేలు. వీటిని తరుచూ తాగడం వల్ల శరీరంలో కెఫిన్ మోతాదు పెరిగి ఆలోచనల్లో స్పష్టత లోపిస్తుంది. ఒత్తిడికి గురి కాకుండా బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు చేయించాలి.
- సరైన నిద్ర, పౌష్టికాహారం, ప్రణాళికా బద్ధమైన రివిజన్ విద్యార్థులు చేసేలా తల్లిదండ్రులు చూసుకోవాలి.
- అరగంట ముందే పరీక్షా కేంద్రం వద్ద ఉంటే మంచిది.

మామూలు పరీక్షల్లాగానే రాయాలి



పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకూడదు. మాములు రోజుల్లో రాసేపరీక్షల మాదిరే రాసేందుకు వెళ్లాలి. పరీక్షలు జరుగుతున్న రోజుల్లో ఆత్మ విశ్వాసం అనేది చాలా ముఖ్యం. పిల్లల ఆరోగ్యం పట్ల పేరెంట్స్ చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల్లో విద్యార్థులు ముందుగా తెలిసిన వాటికి సమాధానాలు రాయాలి. ఆ సమయంలో ఏవైనా జ్ఞప్తికి రాకపోతే ఆందోళన చెందకుండా..తెలిసిన వాటిన్నింటిని రాసిన తరువాత మిగిలిన వాటి గురించి ఆలోచించాలి.

– డా.కె వేణుగోపాల్, టెన్త్ పరీక్షల ప్రత్యేకాధికారి

నోటిఫికేషన్లు విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): తక్షణమే మెగా డీఎస్సీ, గ్రూపు–2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లను జారీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో జరిగిన డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఖాళీ అయ్యే ఉద్యోగాల భర్తీ కోసం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామన్న సీఎం వైఎస్ జగన్ పట్టించుకోవడంలేదన్నారు. తక్షణమే 25 వేల పోస్టుల డీఎస్సీ, 5 వేల పోస్టులతో గ్రూపు–2 నోటిపికేషన్లను విడుదల చేయలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, రంగప్ప పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రీన్ పార్కు సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ (ఏపి 21 టీఈ 4153)ను పోలీసులు సీజ్ చేశారు. నేతాజీనగర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఎస్.సతీష్ కుమార్ రెడ్డి, ట్రాక్టర్ యజమాని ఎన్.విరూపాక్షి రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

రోగులకు పండ్లు పంపిణీ

కర్నూలు(సెంట్రల్): ఎస్‌డీపీఐ మాజీ జాతీయ అధ్యక్షుడు ఎ.సయిద్ సహబ్ సేవలను గుర్తుంచుకొని ఆదివారం ఆయన వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అస్ఫాక్ హుస్సేన్, షేక్షావలి, జలీల్, సలాం, షఫీ అహ్మద్, అబ్దుల్లా, రషీద్ పాల్గొన్నారు.

యోగా ఫెస్టివల్ విజేతలకు సన్మానం



పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు లక్ష్మీకాంత రెడ్డి

కర్నూలు (టౌన్): బెంగళూరు అంతర్జాతీయ యోగా ఫెస్టివల్‌లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించిన క్రీడాకారులను ఆదివారం సన్మానించారు. ఇటీవల రాజస్థాన్‌లో నిర్వహించిన 47వ జాతీయ స్థాయి సీనియర్ యోగాసన పోటీల్లో 6వ స్థానంలో నిలిచిన జిల్లా క్రీడాకారిణీ లాలన ప్రియకు అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి నగదు ప్రోత్సాహం అందజేశారు. కాగ పతకాలు సాధించిన వారిలో 20 నుంచి 25 ఏళ్ల మహిళల విభాగంలో ఎస్.ప్రసన్న (మొదటి స్థానం), 8 నుంచి 10 సంవత్సరాల బాలికల విభాగంలో మనుశ్రీ (మూడవ స్థానం), కృష్ణప్రియ (5వ స్థానం), కేనిషా (ఆరవ స్థానం), 8 నుంచి 10 సంవత్సరాల వయస్సు కలిగిన బాలుర విభాగంలో వి.చతుర్వేది (ఆరవ స్థానం), 25 నుంచి 35 సంవత్సరాల పురుషుల విభాగంలో కె.మునిస్వామి (నాలుగవ స్థానం)లు ఉన్నారు.

7న 'శ్రీ హనుమద్వైభవం' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ సాహితీ వేత్త విద్వాన్ రాముడు రచించిన 'శ్రీ హనుమద్వైభవం' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈ నెల 7వ తేదీ ఉదయం 9.30 గంటలకు గణేష్‌నగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ తాళపత్ర పరిశోధకులు వైద్యం వెంకటేశ్వరాచార్యులు, శతావధాని మద్దూరి రామమూర్తి, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ ఆర్కే శర్మ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. తెలుగు ఉపన్యాసకురాలు డాక్టర్ దండబోయిన పార్వతీ దేవి పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు. సాహితీ ప్రియులు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ

కర్నూలు కల్చరల్: క్రియేచర్స్ బర్న్ టు హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బిర్లాగేట్ సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద సంస్థ నిర్వాహకులు ప్రజలకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేశారు. సంస్థ మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ ఫౌండర్ వైష్ణవి రెడ్డి, సభ్యులు శశికిరణ్, అబ్దుల్లా, రేణుక, మోహన్, ఫరీద్, సజీవనాథ్, చందు, స్వప్న, చాందిని, అరవింద్, వేణుమాధవ్, ప్రవీణ్, రేవంత్, శ్రీకాంత్‌లు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



మట్టలతో ర్యాలీ చేస్తున్న సీ.క్యాంపు ప్రార్థన మందిరం చర్చి సభ్యులు, మహిళలు



ర్యాలీ నిర్వహిస్తున్న కోల్స్ సెంటీనియల్ చర్చి సభ్యులు

కర్నూలు (టౌన్): మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని నగరంలోని చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తును స్తుతిస్తు భక్తి పాటలు పాడారు. స్థానిక చర్చి ఆఫ్ సౌత్ ఇండియా డయాసిస్‌కు చెందిన జొహరాపురం సీఎస్ఐ సంఘంలో పాస్టర్లు కిరణ్‌బాబు, సోలోమోన్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. అలాగే ఎస్‌నగర్‌లోని పాస్టరేట్–4 సీఎస్ఐ హోలీ ట్రినిటీ చర్చిలో పాస్టరేట్ చైర్మన్ రెవెరెండ్ జి. చంద్రశేఖర్, కార్యదర్శి జి.సుదర్శన్‌రావు, కోశాధికారి పి.ఆర్.వినోద్‌బాబులు, స్థానిక కోల్స్ సెంటీనియల్ చర్చి సంఘం ఆధ్వర్యంలో చర్చి సంఘం అధ్యక్షుడు ప్రభుదాసు, కార్యదర్శి అనిల్ నాథ్, చర్చి సభ్యులు మహిళలు ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీ.క్యాంపు ప్రార్థన మందిరంలో చర్చి సభ్యులు ఉదయాన్నే సి. క్యాంపు, మద్దూర్‌నగర్, శ్రీరామ నగర్ వీధుల్లో మట్టలతో ర్యాలీ నిర్వహించారు. అలాగే ఎస్‌టీబీసీ కళాశాల సమీపంలోని గిప్సన్ చర్చి సంఘ సభ్యులు, చిన్నారులు మట్టలు చేతబూని విధులకు గుండా సాగారు. కార్యక్రమంలో చర్చి సండేస్కూల్ సూపరింటెండెంట్ మేరి జ్యోత్స్న అధ్యక్షులు ఎస్. వినోద్ జోషిఫర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే షమ్మాచర్చి ఆధ్వర్యంలో చర్చి సభ్యులు, మహిళలు ర్యాలీ నిర్వహించారు.

ఇన్‌చార్జ్ ఈఈటీగా నాగేశ్వరరావు

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు సర్కిల్ ఇన్‌చార్జ్ టెక్నికల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరుగా నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఇక్కడ రెగ్యులర్ అధికారిగా పనిచేస్తున్న ప్రసన్నకుమార్ నెల్లూరు జిల్లా నాయుడుపేటకు బదిలీ అయిన విషయం తెలిసిందే. దీంతో ఎం అండ్ పీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావుకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీపీఆర్‌తో ప్రాణాలను నిలపొచ్చు



కోర్సు అభ్యసించిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ అశోక్, డాక్టర్ చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): గుండెపోటుకు గురైన వారికి సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చని విజయవాడకు చెందిన అనెస్తెటిస్ట్, బీఎల్ఎస్ ట్రైనర్ డాక్టర్ వై.అశోక్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండురోజులుగా స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో నిర్వహిస్తున్న బీఎల్ఎస్ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బేసిక్ లైఫ్ సపోర్ట్ కోర్సులో భాగంగా సీపీఆర్ ఎలా నిర్వహించాలనే దానిపై ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర కల్కూర, డాక్టర్ శ్రీలత, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పేకాటరాయుళ్ల అరెస్ట్

కృష్ణగిరి: మండల పరిధిలోని రామకృష్ణాపురం నుంచి టి.గోకులపాడుకు వెళ్లే రహదారిలోని ఓ చెట్టు కింద పేకాట ఆడుతున్న 10 మందిని ఆదివారం దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రామకృష్ణాపురానికి చెందిన పెనికలపాటి శ్రీనివాసులు, కమ్మ రామకృష్ణ, గొల్ల దామోదర్, కోడుమూరుకు చెందిన పింజరి అబ్దుల్‌నబీ, గోరంట్లకు చెందిన కురువ రాముడు, బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన గొల్ల కొదండపాణి, ఎస్‌హెచ్ ఎర్రగుడికి చెందిన బి.శేఖర్ రెడ్డి, వెల్దుర్తికి చెందిన బోయ వెంకటనాయుడు, కృష్ణాపురానికి చెందిన సుంకిరెడ్డి, గోకులపాడుకు చెందిన తూము లక్ష్మీకాంతరెడ్డిలను అరెస్టు చేసి వీరి వద్ద నుంచి రూ.26,610లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణం

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో రమేష్ రెడ్డి(31) అనే వ్యక్తి పురుగు మందు తాగి బలవన్మరణం చెందాడు. ఎస్ఐ మహేషకుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో పుండుకూర భాస్కర్‌రెడ్డి పెద్ద కుమారుడు కాప రమేష్ రెడ్డి వ్యవసాయం చేసేవాడు. 8 ఎకరాల్లో మిరప, పత్తి పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయాడు. శనివారం తండ్రితో కుమారుడు గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. రమేష్ రెడ్డి రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లాడని అనుకున్నారు. మిరప పంట తీవ్రంగా నష్టం రావడంతో పాటు అప్పులు ఎక్కువగా ఉండడంతో తీవ్ర మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడాడు. ఆదివారం పొలాల్లో పనులకు వెళ్లిన కూలీలు మృతదేహన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విచారణ చేసి రమేష్‌రెడ్డి మృతదేహమని గుర్తిం చి పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య నర్మద ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేష్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు వెల్లడించారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామానికి చెందిన పింజరి లాలప్ప (35) ఆదివారం ఇంట్లో దూలానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. భార్యాభర్తల నడుమ మనస్పర్ధలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గడ్డివాములు దగ్ధం

కోడుమూరు రూరల్: వర్కూరు గ్రామంలో ప్రమాదవశాత్తు రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటనలో బాధిత రైతు బోయ నడిపి మాదన్నకు రూ. 80 వేల వరకు నష్టం వాటిల్లింది. కోడుమూరు అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు హుటాహుటిన చేరుకుని ఆ మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రెండు గడ్డివాములు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు.

నిర్లక్ష్యంతో నిరుపయోగం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా అటవీ శాఖ భవనం



వృథాగా ఉన్న అటవీ శాఖ కర్నూలు రేంజర్ కార్యాలయం,



కార్యాలయం ఆవరణలో పట్టపగలు మద్యం సేవిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: అధికారుల నిర్లక్ష్యంతో విలువైన స్థలం నిరుపయోగంగా మారింది. నగరం మధ్యలో కేసీ కెనాల్ పక్కన లక్ష్మినగర్ దగ్గర రాజ్‌విహార్ – సీక్యాంప్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కలో రూ.కోట్ల విలువ చేసే అటవీ శాఖ భవన్ వృథాగా ఉంది. గతంలో ఇక్కడ అటవీ శాఖ కర్నూలు రేంజర్ కార్యాలయం ఉండేది. దాన్ని కలెక్టరేట్ వెనక వైపు ఫ్లైయింగ్ స్క్వాడ్ కార్యాలయం దగ్గరికి మార్చారు. అయితే సుమారు ఐదు సంవత్సరాలకు పైగా ఈ భవనం ఖాళీగా ఉంది. ఇదే అదునుగా చుట్టుపక్కల ఉన్న మందుబాబులు వారికి అడ్డాగా మార్చుకున్నారు. పట్టపగలు భవనం ముందు మద్యం సేవిస్తున్నారు. రాత్రిళ్లు అసాంఘిక కార్యక్రమాలతో పాటు వ్యభిచారం జరుగుతున్నట్లు చుట్టపక్కల వారు చెబుతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు దీని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. సుమారు రూ.6 కోట్లకు పైగా విలువ చేసే ఈ స్థలాన్ని, కార్యాలయాన్ని అధికారుల రక్షణలో లేకపోవడం శోచనీయం. అటవీ శాఖకు సంబంధించిన విలువైన స్థలాలు, భవనాలు చాలా చోట్ల వృథాగా ఉన్నాయి. కొన్ని చోట్ల అటవీ శాఖ ఉద్యోగులే మద్యం సేవించడానికి వాటిని వాడుకుంటున్నట్లు ఆ శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అటవీ శాఖకు సంబంధించిన వాటన్నింటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ఇటీవలే నాదృష్టికి వచ్చింది

డీఎఫ్‌వోగా నేను బాధ్యతలు స్వీకరించాక ఎక్కడెక్కడ ఉన్న అటవీ శాఖ స్థలాలను, భవనాలను గుర్తించి మా ఆధీనంలోకి తీసుకుంటున్నాం. అటవీ శాఖ కర్నూలు రేంజర్ పాత కార్యాలయం నిరుపయోగంగా ఉన్నట్లు ఇటీవలే నా దృష్టికి వచ్చింది. ఆ భవనాన్ని రెన్నోవేషన్ చేసి రేంజర్ కార్యాలయం రేంజర్ రెసిడెన్సీని ఏర్పాటు చేయాలనుకున్నాం. కొన్ని ఇబ్బందులతో ఆ ప్రాతిపాదన ఆగిపోయింది. ఫారెస్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంగా వాడుకుంటుమాని అసోసియేషన్ వారు అడిగారు. వారి వినతి మేరకు త్వరలోనే అసోసియేషన్‌కు అప్పచెపుతాం.

– పి. శివశంకర్‌రెడ్డి జిల్లా అటవీ శాఖ అధికారి

కొత్తూరులో న్యాయమూర్తుల పూజలు

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కర్నూలు జిల్లా జడ్జి శ్రీనివాసరావు, నందికొట్కూర్ జూనియర్ సివిల్ జడ్జి తిరుమలరావు పూజలు చేశారు. వీరికి ఆలయ మర్యాదలతో అధికారులకు స్వాగతం పలికారు. పూజల అనంతరం వారికి తీర్థప్రసాదాలను అందించారు. శేషవస్త్రాలతో సన్మానించారు. ఈఓ రామకృష్ణ, ఆలయ అధికారులు సుబ్బారెడ్డి, అర్చకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తులకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

సీఎంకు వాల్మీకుల కృతజ్ఞత



దివంగత వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్‌చంద్రబోస్

వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తు అసెంబ్లీలో చేసిన తీర్మానంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఆదివారం కర్నూలులో చేపట్టిన మహా ప్రదర్శనకు భారీ ఎత్తున ఉమ్మడి కర్నూలు జిల్లాల నుంచి బోయ, వాల్మీకులు తరలివచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ నుంచి జీజీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న మహర్షి వాల్మీకి విగ్రహం వరకు వాల్మీకులు భారీ ప్రదర్శన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండాలు, కాషాయ జెండాలు, బాణసంచా పేలుళ్లు, సీఎం వైఎస్ జగన్ జిందాబాద్ నినాదాలతో నగరం హోరెత్తింది. ఎస్టీ తీర్మానంతో వాల్మీకుల్లో నూతన జోష్ వచ్చింది. – కర్నూలు(అర్బన్)



ప్రదర్శనలో పాల్గొన్న మాజీ మేయర్ బంగి అనంతయ్య,



ర్యాలీలో పాల్గొన్న వాల్మీకులు,



వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి జయరాం తదితరులు